# మిస్టర్ గరటయ్యా!

'ఇదిగో గరటయ్యగారూ... మిమ్మల్నే పిలిచేది... చెవుడు కూడా వచ్చిందా ఏమిటి?...' పిల్చినా రెస్పాన్స్ లేకపోవటంతో గొణుక్కుంది రవళి.

'ఎంత పొగరే నీకు? నన్ను... తాళిగట్టిన మొగుడ్ని పేరుతో... అందునా 'నిక్‌నేమ్'తో పిలుస్తావా? ఆఫీసులో వాళ్ళందరూ ఆ పేరుతో నన్ను ముప్పైయ్యేళ్ళుగా పిలుస్తున్నా... సరదాపడి మౌనం దాల్చాను. చివరికి నువ్వూ అలా పిలవటం మొదలుపెట్టావూ అంటే... క్లాసు పీకాల్సిందే...' కోపంతో వూగిపోయాడు గోవిందయ్య వురఫ్ గరటయ్య.

'క్లాసే పీకుతారో... నెత్తిన జుట్టే పీక్కుంటారో?... అందరూ మిమ్మల్నలా పిలవంగా లేనిది... నేను పిలిస్తే పొడుచుకొచ్చిందా ఏమిటీ?-' కిచన్లోంచి వస్తూ గఁయ్‌మంది.

'నువ్వు నన్నా పేరుతో పిలుస్తుంటే... పోనీలే పెళ్ళాం కదాని వూరుకున్నా... రేపు మీ డాడీ... అదేనే నాకాళ్ళు కడిగి కన్యాదానం చేశాడే ఆ మహానుభావుడు... మా అత్తగారు అనగా మీ మమ్మీ కూడా పిలవటం మొదలుపెడితే నా పరువు ప్రతిష్ఠ హుస్సేన్‌సాగర్ పాలవుతయ్!...' ఉడుక్కున్నాడు గోవిందయ్య.

'మావాళ్ళేం ఖర్మ!... మనం పిల్లనిచ్చుకునే చోట.. మనింటికి కోడళ్లను తెచ్చుకునే వైపు వారంతా కూడా మిమ్మల్ని 'నిక్‌నేమ్'తోనే పిలుస్తారు. నో డౌట్...' కరాఖండిగా చెప్పింది రవళి. ఇన్నేళ్ళ కాపురంలో మీ అసలు పేరేమిటో కూడా మరచాను. గుర్తుండి ఏడవటంలేదు...' మరికాస్త అజ్యం పోసినట్టు మాట్లాడింది.

'ఆఫీసులో మా బాస్ పేరు పెంటయ్య. ఆయన పిలిచినప్పుడల్లా వెళ్లి పక్కనే నిలబడాలంటే కర్చీఫ్‌తో ముక్కు కడ్డం పెట్టుకోవటం గమనించి 'ఫైరయ్యే'వాడు. అఫ్‌కోర్స్ తరువాత పట్టించుకోవటం లేదనుకో... అలాగే నన్నూ గరటయ్యా అంటుంటే సంబరపడమంటావా?...' అత్త కొట్టినందుక్కాదు తోడికోడలు నవ్వినందుకన్నట్టు... అందరూ తనను 'గరటయ్యా'ని పిల్చినందుక్కాదు... భార్య సైతం ఆవిధంగ పిలవటం కడుపులో దేవినట్టయింది.

బ్రేక్ టైంలో మళ్ళీ కిచన్లోకి పరుగుపెట్టి 'స్టౌ' మీద కాఫీ పెట్టింది.

కాఫీకప్పుతో ప్రత్యక్షమై భర్త ఆగ్రహానికి గురికాకుండా వుండేవిధంగ 'కాకా' పట్టే

ప్రయత్నం చేస్తూ 'ఇంద! హాట్‌హాట్ కాఫీ సిప్ చేస్తూ... మీకు అసలు 'గరటయ్య' అనే పేరు ఏ కారణాన ప్రచారంలో కొచ్చిందో... కాస్తంత వివరిద్దురూ...?' అడిగింది రవళి.

'ఆ పేరెలా వచ్చిందంటే...' చెప్పబోయినవాడల్లా ఆగి 'అదో పెద్ద కథలే! అంటే ఎనిమిదివేల ఎపిసోడ్స్‌లో ప్రసారమయ్యే టి.వీ. తెలుగు సీరియల్లాంటిదనుకో...' సిప్ చేసి కాఫీ సువాసనకు తదాత్మ్యం చెందాడు.

'నాతో చెప్పటానికి సందేహిస్తారేం? నేను మీ అర్ధాంగిని కదా?... నిజాలను మీరు మనసులోనే దాచుకోవటం... నేరం! అండ్రస్టాండ్!... లేట్ చేయక చెప్పరూ...' దువ్వింది మొగుడ్ని విషయాన్నెలాగైనా రాబట్టాలనే ప్రయత్నంలో.

ఇదేదో గట్టిపట్టే పడుతోందే?... చెప్పేదాకా వదిలేట్టులేదు. మనసులో గొణుక్కున గోవిందయ్య 'అనగనగనగా' అంటూ మొదలుపెట్టగానే...

'స్టాపిట్! కాకమ్మ కబుర్లు చెప్పద్దు. నేవినను. నాన్చద్దు. స్ట్రైట్‌గా విషయానికి రండి! చెప్పకపోతే నైట్‌కి పుడ్డుండదు...' అల్టిమేటం జారీ చేయటంతో...

'అయితే విను... ఆ రోజుల్లో మా తాతగారు అంటే మా గ్రాండ్‌ఫాదర్... కులవృత్తి మానేసి... సంపాదించినంతవరకు చాలనుకుని తృప్తిపడి... రాజకీయాల్లోకి దిగాలని నిర్ణయించుకున్నవాడై... మున్సిపల్ ఎలక్షన్స్‌లో వార్డు కౌన్సిలర్‌గా నిలబడి గెల్చాడు. ఒక్కసారి కాదు వరుసగా మూడుసార్లు గెలిచి 'హేట్రిక్' కొట్టాడు...'

'నేనడిగిందేమిటి? మీరు చెప్తున్నదేమిటి?' క్లాసులో స్టూడెంట్‌ని టీచర్ నిలదీసి గదిమినట్టు గదిమి కళ్ళెర్రచేసింది.

'కారణం అడిగేవు కదా?... దానివెనుక వున్న ఫ్లాష్‌బేక్ చెప్పకపోతే... నీకు స్టోరీ ఎట్లా అర్థమౌతుంది?-'

'తెలిసిన విషయాన్నే పదేపదే సుత్తికొట్టి నన్ను తినకండి! అసలు మీకా పేరు... అదే 'గరటయ్య' అని ఎందుకొచ్చిందో సూటిగ చెప్పండి... చాలు! మిగతా స్టోరీ స్క్రీన్‌ప్లే నేను తయారు చేసుకోగలను...' మరో ముక్తాయింపు ఇచ్చింది రవళి.

'నీకు తెల్సింది సినిమా ఇంటర్వెల్ దాకానే!... మిగతా బేలన్స్ చెప్పాలనేదే నా ప్రయత్నం... కట్టె... కొట్టె... తెచ్చె... అని మూడు ముక్కల్లో చెప్పటానికిదేమైనా రామాయణమా?-'

'రామాయణ భారతాలు చెప్పకండి. నన్ను బోరుకొట్టి విసిగించకుండా... 'టూకీ'గ చెప్తే అర్థం చేసుకోగలను.

'ఆఁ!... ఎక్కడ ఆగాం మనం?...' కనుబొమలెగరేస్తూ భార్య ముఖంలోకి చూశాడు.

రవళి చెప్పబోతుండగా 'ఆఁ...ఆఁ! గుర్తొచ్చిందిలే... చెప్తాను. సావధాన చిత్తంతో ఆలకించుము శ్రీమతీ...'

'ఇదేం వినాయక చవితినాడు చెప్పుకునే కథా? అసలు మీ ఇంటిపేరు 'సోది' వారని పెట్టివుంటే బాగుండేది!- మీ 'కహానీ'లన్నీ విన్లేక చస్తున్నాను. ఇన్నేళ్ళ కాపురంలో మీరు చెప్పే భేతాళ కథలు వినీ వినీ నాకున్న మతి కాస్తా అటకెక్కింది...' విసుగు ప్రదర్శించింది.

'అదుగో మళ్ళీ!- నన్నూ నా ఇంటిపేరును కామెంట్ చేస్తే సహించను...'

'చెప్పండి మహాప్రభో! పిల్లలు కాలేజీనుంచి ఇల్లు చేరుకోకముందే మీ గొప్పల కథ చెప్పేయండి. నాకు అవతల బోలెడు పన్లున్నాయ్...'

'అయితే విను! శ్రీమహావిష్ణువు చేతిలో గద వున్నట్టే... మా ఇంటిపేరిట వారి చేతుల్లో 'గరిటె' వుండేది. అందుకే మా తాతగారు మున్సిపల్ ఎన్నికల్లో నిలబడ్డప్పుడు ఎన్నికల గుర్తుగా 'గరిటె'ను ఎన్నుకుని మా ఇంటిపేరుకు సార్థకత చేకూర్చాడు.

'మీరేం చెప్తున్నారో అర్థం కాలేదు'

'బహుభాషా కోవిదురాలివి కదా? ఈ మాత్రం అర్థం కాలేదా మరి...'

'మూడువంతుల జీవితం గడిచిపోయింది... ఇక నాకెందుకులెండి... నేవెడుతున్నా... రాత్రికి కందిపచ్చడి రుబ్బాలి... రేపటి ఇడ్లీ టిఫిన్‌కోసం పప్పు నానబెట్టాలి!... మీకేం తీరుబడిగా కూర్చుని ఎన్ని కథలైనా చెప్తారు...' రవళి విసుక్కుంటూ లేచి వెళ్ళిపోయింది.

'కూర్చో... వెళ్ళిపోకు! శ్రోత లేకపోతే నేనెవరికి చెప్పాలి? ఇంటి గోడకా?- ఆఁ! శ్రీహరికి చిహ్నాలు గద, శంఖు, చక్రం ఎట్సెట్రా లేకుంటే ఆయన్ను గుర్తించటం ఎంత కష్టమో... మాకు... అంటే తాతముత్తాతల రోజుల్లో గరిటె చేతిలో లేనప్పుడు వారు 'వంటవాళ్ళు' అని గుర్తించటం అంతకంటే ఎక్కువ కష్టంగా వుండేదిట!

'ఛఛఛ!... ఛీఛీఛీ!.. మీది వంటలు చేసుకు బతికే వంశమా? ఈ సీక్రెట్ తెలిసుంటే మిమ్మల్ని ఛస్తే చేసుకుని వుండేదాన్ని కాదు. నేరకపోయి మీ ఇంటి కోడలినైనందుకు లెంపలేసుకుంటున్నాను...' వెళ్ళిపోబోయిన రవళి అయిష్టంగా కూర్చుంది.

'వంటల వంశమాని అంత తేలిగ్గా కొట్టి పారేయకు. మా పూర్వీకులను కూరలో కర్వేపాకులాగ తీసి పారేస్తే నాకు మండుద్ది!- వంట వాళ్ళనే ఇప్పుడు ఇంగ్లీషులో

'శీటరర్స్' అని ముద్దుగా పిల్చుకుని మురుస్తున్నాం. ఈ వృత్తిలో వేలు... లక్షలు కోట్లు ఆర్జించిన వాళ్ళున్నారు తెలుసా?-'

'మీరు లక్ష చెప్పండి!...కోటి చెప్పండి... వంటలవారని చెప్పుకోవటానికి మీకు సిగ్గులేకపోయినా నాకు మాత్రం వళ్ళంతా కంపరంగ వుంది విన్న క్షణం నుంచీ...' చిటపటలాడింది రవళి.

'భయపడకోయ్! తాతగారి రోజుల్లోనే వంటల వృత్తికి మంగళం పాడారు. ఆ కారణంగానే తాతగారు డాడీని చదివించి ఇంజనీరుని చేశారు. ఆయన కడుపున పుట్టినందుకు నేనూ లక్షణంగా వుద్యోగం చేసుకుంటున్నాను. నాగురించి నీకు తెల్సుగా... ముఫత్‌గా ఎవరి దగ్గరా కాఫీ కూడా తాగను... నా బీరువా తెరిచి... ఇన్నేళ్ళ నీ కాపురంలో అందులో వున్న లాకర్ ఓపెన్ చేసి ఏముందో చూశావా?-'

'మీ బీరువా తెరిచే పని నాకేముంది? లాకర్లో ఏమున్నాయో ఏమో నేనెరగను...'

'అయితే పద లోపలికి చూపిస్తాను...'

'ఛాల్లెండి పరాచికాలు!...'

'నే మాట్లాడేది డబుల్ మీనింగ్ డైలాగుకాదే... రా వచ్చి చూస్తే నీ గుండె ఆగిపోతుంది...' రవళిని చెయ్యి పట్టుకుని బెడ్‌రూమ్‌లోకి లాక్కెళ్ళి బీరువా ఓపెన్ చేసి... లాకర్ తెరిచాడు.

లాకర్‌లోనుంచి బంగారు గరిటె... వెండి అట్లకాడ బైటికి తీసి చూపిస్తూ 'ఇది మా తాతగారి ఆస్థి! ఆయన వంటలు చేసే రోజుల్లో నూజివీడు జమీందారుగారు వారి చేతివంట తిని 'వహ్వా' అంటూ మెచ్చుకుని... తాతగారికి వెండి బంగారంతో చేసిన పీటిని బహుమతిగా ఇవ్వటమే కాకుండా... పదెకరాల సుక్షేత్రమైన మాగాణీ పొలం తాతగారి పేర రాసిచ్చార్ట!- ఇదీ మా వంశీకుల గొప్పతనం! అర్థమైందా?-'

'పీటి ఖరీదు ఇప్పుడెంతుంటుందండీ?-'

బంగారు గరిటె నూరు తులాలుంది! ప్రస్తుత మార్కెట్ ధరను బట్టి లక్షపైమాటే...!

ఆ మాట విన్న రవళి కళ్ళు మిలమిలా మెరిసాయి!

'అబ్బ! ఎంత గొప్ప వాళ్ళండీ మీ తాతగారు!'

'మరింతకుముందు వంటలవాళ్ళమని తుస్కారంగ... హీనంగ మాట్లాడావు కదా?- ఇప్పుడు అర్థమైందా మా ఇంటిపేరులో గల గొప్పదనం?! అందుకే మా పూర్వీకులు

వంటలు చేసుకు బతికేవారని గర్వంగా అందరితో చెప్పుకున్నాను. గరిటె తిప్పే వాళ్ళం కాబట్టి మా కొలీగ్సంతా నన్ను ముద్దుపేరుతో 'గరటయ్యా' అని పిల్చినా నేను ఏమాత్రం బాధపడను- అర్థమైందా?'

'అద్సరే... వీటిని కరిగించి వస్తువేదైనా చేయించుకుందామా? అమ్మాయికి నక్లెసో... నాకు చంద్రహారమో చేయించి పెట్టకూడదూ?-'

'నో! వీటిని కరిగించటానికి నాకు మనస్కరించదు. వీటిని మా తాతగారు మా డాడీకి ఎంతో ప్రేమతో అందచేశారు. మా డాడీ వీటిని నా పరం చేశారు! తరతరాల ఈ సంపదను కరిగించవద్దనీ... ఖర్చు చేయద్దనీ మా డాడీ చేతిలో చెయ్యి వేయించుకుని ప్రామిస్ చేయించాడు నాచేత. వీటిని మనం కళ్ళు మూసే సమయంలో మన వంశాకురమైన రఘురామ్‌కి అప్పగించటం ధర్మం!-' ఆవిధంగ తనను 'గరిటయ్య' అని అందరూ పిలవటంలో గల అంతరార్థాన్ని భార్యకి వివరించాడు గోవిందయ్య.

అక్కడితో రవళి మనసులో గల అనుమానం తీరి సినిమా అయ్యాక 'శుభం' కార్డు పడ్డట్టయింది!

- సమాప్తం -